# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- తెలుగును వ్యవహారిక భాషగా మార్చిన మహనీయులు గిడుగు వెంకట రామమూర్తి అని మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు.
- వికేంద్రీకరణ విధానంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- రక్తహీనత నివారణ చర్యలలో మెరుగైన ప్రగతిని కనబరిచినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దేశంలోనే తొలి స్థానం లభించింది.

========================

ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను ఈ రంగాలలో సాధిస్తామని తెలిపారు. విశాఖపట్టణంలో ఈ రోజు ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా మార్చటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆక్వాహబ్ గా ఉందని చంద్రబాబు నాయుడు వెల్లడిస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

========================

తెలుగును వ్యవహారిక భాషగా మార్చిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈ రోజు తెలుగు

భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ... తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేయడంలో గిడుగు రామమూర్తి చేసిన కృషి ఎనలేనిదన్నారు. తెలుగు భాషా పురస్కార కమిటీ ఎంపిక చేసిన గిడుగు వెంకట రామమూర్తి పురస్కారాల గ్రహీతలను మంత్రి సత్కరించారు.

========================

అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రగతికి ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో ఈ రోజు జరిగిన సదస్సులో మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఉత్తరాంధ్రలో ఐటి, ఫార్మా, లాజిస్టిక్స్ పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు. చార్టర్డ్ అకౌంటెంట్స్ రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించాలని కోరారు. గతంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో రాష్ట్రం అధిక లబ్దిని పొందిందని, అదే తరహాలో ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా మరింత లబ్ధి చేకూరుతుందని నారా లోకేష్ పేర్కొంటూ..

(వాయిస్ 20 సెకన్)

విరామం

========================

రక్తహీనత నివారణ చర్యలలో మెరుగైన ప్రగతిని కనబరిచినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దేశంలోనే తొలి స్థానం లభించింది. ఆరు నెలల శిశువు నుంచి చిన్న పిల్లలు, యువత, గర్భిణీలు, బాలింతల్లో రక్త హీనత తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా తీసుకున్న చర్యల కారణంగా జాతీయ స్థాయిలో ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది. రక్తహీనత తగ్గించే సిరప్, మాత్రల పంపిణీకి సంబంధించిన వివిధ కేటగిరీల్లో కనబరిచిన పనితీరుకు రాష్ట్రానికి తొలి ర్యాంకును కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు.

========================

విశాఖపట్టణంలో పర్యాటక రంగ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పర్యాటక శాఖ ప్రవేశపెట్టిన `హాప్ ఆన్.. హాప్ ఆఫ్ ` డబుల్ డెక్కర్ బస్సులను ఆర్‌కే బీచ్ రోడ్ లో ముఖ్యమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విశాఖ ఆర్థిక రాజధానిగా, ఆసియా టెక్నాలజీ హబ్ గా ఎదగబోతోందని చెప్పారు. విశాఖ.. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలతో పోటీ పడుతోందని చెప్పారు. పర్యాటకులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. తీరప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షించేలా బీచ్ లు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు.

========================

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో ఈరోజు జరిగిన నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోతే ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేసి వారికి అండగా నిలుస్తోందన్నారు. పి.ఎం.కిసాన్.. అన్నదాత.. సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తోందన్నారు.

========================

భారత క్రీడా చరిత్రలో చిరస్మరణీయమైన కీర్తిని మేజర్ ధ్యాన్ చంద్ సాధించారని శ్రీ సత్య సాయి జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. ప్రపంచం మొత్తం హాకీ మాంత్రికుడుగా ఆయనను గౌరవిస్తుందని చెప్పారు. పుట్టపర్తిలోని

కలెక్టరేట్ లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని కోరారు.

=========================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు ఉత్తర కోస్తా జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదే విధంగా ఉరుములతో కూడిన మెరుపులతో పాటు బలమైన గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

=========================

=========================